# కన్నె మనసు

కస్తూరి విశ్వనాథం



మల్లె మెల్లగా నవ్వింది. గులాబి గుసగుసలాడింది. సిగ్గు మొగ్గలేసింది. బుగ్గ కందిపోయింది.

అడుగుముందుకేసింది. వెనుక చప్పుడయింది. తిరిగిచూసింది. మాధవీలత మందహాసం చేసింది. తల త్రిప్పుకొంది. సంపంగి మొగ్గ సన్నగా నవ్వింది. చిరుకోపం చిందులాడింది. మూడడుగులు ముందు కేసింది. పైన చిటుక్కుమంది. వీపు టపీక్కు మంది. ఉలిక్కి పడింది. సన్నజాజి పరిహాలాడింది. సిగ్గు ముంచుకొచ్చింది.

"ఛీ" వెనక్కు తిరిగింది.

"రాధక్కా!" రామచిల్క.

"దీనికింతకం ఓపనిలేదు" అడుగువేయబోయింది. ఆగిపోయింది. వళ్ళు పులకరించింది. హృదయం పరవశించింది. మనసు పొంగి పోయింది. మెల్లగా చూపు వెనక్కు తిప్పింది. నిట్టూర్పు విడిచింది. దానిమ్మ కొంగు పట్టుకుంది. ఆ మధుర సన్ని వేశాన్ని ఊహించ బోయింది. నీలగిరిలో మబ్బు కొంగుల్లో నుంచి తొంగిచూశాడు జాబిల్లి. సిగ్గులో తలవంగి పోయింది. గోరువంక పకపక లాడింది. ఒక్క పరుగుతో పెరటి గుమ్మంలో కాలుపెట్టింది.

"అప్పుడే పనిపూర్తయిపోయిందే" అమ్మ.

"అమ్మడూ! ఏం చేస్తున్నావు? భేష్ అలాగా ఉండాలి." నాన్న.

"అక్కాయ్! బా.........వ" చిలిపి చిచ్చి తమ్ముడు.

"సీపో" గోముగా మందలింపు.

"అదేంటమ్మగోరూ? అప్పుడ్నే........"

సిగ్గు. బిడియం. ఆనందం. అనుభూతి.

ఈరోజు తన జీవితంలో మరువ రానిది. మరువరానిది. తను కలగన్న రోజు. తనకు ప్రియమైన రోజు.

మనసు పరవశిస్తూంది. హృదయం ఉప్పొంగి పోతూంది. అవధులులేని ఆనందం. అంతులేని యువ అనుభూతి. కారణం? బావ. తనబావ. మూడువసంతాల క్రితం వెళ్ళాడు బావ సప్త సముద్రాలు దాటి పెద్ద చదువులకోసం. అపార జ్ఞానాన్ని సంతరించుకొని ఈరోజు తిరిగి వస్తున్నాడు. తనూ నాన్నా విమానాశ్రయానికి వెళ్ళారు బావ కోసం.

బావ వస్తున్నాడు. ఎవరి కోసం? తనకోసం. అమాటనుకొంటే వళ్ళు పులకరిస్తుంది. ఏ లోకాలకో ఎగిరిపోయినట్లుంటుంది.

ఆనాడే బావను చూసింది. మళ్ళీ చూనే లేదు. ఎలా వీలవుతుంది తనవిచ్చిగాని. బాగా ఎదిగిపోయి ఉంటాడు. ఎంతో మార్పు వచ్చి ఉంటుంది. అమాట కొస్తే తనుమాత్రం.—అప్పుడప్పుడేగా వోణీ వేసుకొంటోన్నది. ఇప్పుడు? చీరకడు తూంది. ఇంకా ఇంకా ......ఎంతోమార్పు. బావను చూడాలి. మనసు తొందరచేస్తూంది. హృదయం ఆరాట పడుతూంది.

"ఛీ"! పాడు గడియారం. ఇంకా ఏడున్నర కూడ కాలేదు. తనేమో ఆరింటికే తయారయింది. ఇంకా రెండు గంటలకు పైగా ఇలా ఉండాల. గడియారం పైన కోపం వచ్చింది. గిరగిరా రెండు ముల్లు త్రిప్పివేయాలని పించింది. కాలచక్రం తిరుగడుగాపురి.

"కిర్..ర్.....ర్....." తలుపు.

మనసులో ఆతురత. ఆరాటం...సిగ్గు.

"ఛీ నువ్వా?" విసుగు.

"మరి బావగారెల్లాగొస్తారండి అప్పుడ్నే!" పని పిల్ల. "ఈమాసం రావాలా, మీరు యెల్లాలా తోడుకొని రావాలా......"

"ఛీ! పోవే అవతలికి" చిరాకు.

"నాకెందుకు లెండి పోతూండాను. అమ్మగోరూ మిమ్మల్ని పెద్దమ్మగోరు పిలుస్తుండారండి".

"సరేలే వెళ్ళు" గద్దింపు మధ్యన.

దీనికే పరిహాసాలే. ప్రొద్దుట్నించి ఒకటే

కంగా ప్రేమిస్తున్నాను. పెళ్ళి కూడా చేసుకుంటాను......!' బావ పిచ్చికి తను పిచ్చిగా నవ్వుకొంది. అదే జవాబు వ్రాసింది చిలిపితనంగా 'పిచ్చి బావా! నన్ను పెళ్ళి చేసుకోకపోతే మరేం చేసుకొందా మనుకొన్నా'వంటూ.

తన హృదయం పరిపక్వత నొందిం తర్వాత, లోకాన్ని బాగా తను తెలిసికొన్న తర్వాత, నిర్మల హృదయంతో బావ అనేవాడు. 'రాధా! నా మనసు ఏదోవిధంగా ఉంది. నిన్ను పదే పదే చూడాలని పిస్తూంది. నా ప్రతి కదలికలోనూ ప్రతి చేష్టలోనూ నీవే చిరునవ్వులు చిందిస్తూ కనబడుతున్నావు. ఎప్పుడూ నీ ఫోటోను చూసుకొంటూ నిన్ను చూస్తున్నట్లు మురిసిపోవడమే మార్గాంతరం నాకు. ఇక నిన్ను చూడకుండా ఇలా ఎక్కువ రోజులు మనలేనని పిస్తూంది' తన పెదాలపైన ఒక దరహాసం తళుక్కున వెలిగి మాయమయ్యేది.

ఇక జీవిత సత్యాన్ని తెలిసికొన్న తర్వాత, పరస్పర హృదయాల్ని బాగా అర్థం చేసుకున్న తర్వాత పూర్ణ పరిపక్వంతో, భావభరితంగా అనేవాడు బావ 'రాధా! నారాధా! ఎంత తియ్యగా ఉంది. నీవు రాధ, నేను మాధవుడు. మన పేర్లు కూడా ఎంతచక్కగా కుదిరాయో చూడు. రాధా మాధవులు. అందమైన బృందావనము. కోయిలల కలకంఠరవము. యామినీ సైకత స్థలాలు. సుమరజ తరంగ డోలికలు. అబ్బ! ఎంత చక్కగా ఉంది. రా....ధా..మా..ధ..వు..లు. రాధా! మైమరచి పోతున్నావా? అప్పుడే కాదుసుమా? చూడు. నాకీక్షణంలో 'కరుణశ్రీ' గారి 'పారవశ్యం' గుర్తుకు వస్తూంది. అలా మన మిద్దరమూ రాధా మాధవులమై పరవశత్వ మందే దెన్నటికో! చెప్పుకో చూద్దాం? తెలియదా? పోనీ చెప్పనా?....'

ఇలా బావ 'పారవశ్యం'లో లీనమైపోతే ఆ ఆనంద పారవశ్యంలో తన హృదయం లేడిపిల్లలా చెంగు చెంగున గంతులు వేసేది. బావ భావకల్పనలకు రూప కల్పనలు కావించుకొని హృదయ ఫలకంపై లిఖించుకొని, బావకోసం పరితపించుతూ 'కరుణామయి' అయి 'రాధనురా ప్రభూ!.....' అంటూ గళమెత్తి రాలు కరిగేలా గానం చేస్తూ తోటలోని ప్రతి పూల మొక్కకూ తన వేదన నివేదించుకొనేది.

ఇంత జరిగిపోయినప్పటికీ ఇప్పుడు బావ వస్తున్నాడంటే ఎదుట పడాలంటే అమితమైనసిగ్గుగా ఉంది. దీనికి కారణం బావకూ తనకూ జరిగిన

# కన్నె మనసు


'ప్రచ్ఛన్న ప్రేమాయణ'మంతా ఒక్కసారి గుర్తుకు వచ్చి సిగ్గుతో ముంచేస్తుందనే కాబోలు. అవును అదే కారణం.

ఈ మధ్య బావ దగ్గర నుంచి ఉత్తరాలంతగా రావడం లేదు. పాపం బావకు అక్కడ చదువు కష్టమేమో. ఆఖరి యేడు కాబట్టి తీరిక చిక్కడం లేదేమో. లేకపోతే...... ఉత్తరాలు వ్రాస్తే కబుర్లు అయిపోతాయని, వచ్చిం తర్వాత తన్ను దగ్గర కూర్చోబెట్టుకుని, నేరుగా కబుర్లన్నీ చెప్పి తన్ను ఆశ్చర్యంతో ముంచెయ్యాలనేమో. అవును. అంతే కావచ్చు. లేకపోతే ఎందుకు వ్రాయడు? హు. పి..చ్చి బావ. తనురావాలేగాని కబుర్లకేం కొదువ.

లేకపోతే.... బావ మారిపోయాడేమో. ఆ పడమటి నాగరికతే వంట పట్టిందేమో. తన్ను మర్చిపోయాడేమో. తనంటే ఇష్టంలేదేమో. వచ్చాక ఆమాటే అనేస్తే? ఏమో ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికేం దెలుసు. అయినా అసాధ్యం. తనేం చేయగలదు? ఏం చెయ్యాలి? ఏడవాల్సిందేనా? కాదు అలా జరిగేందుకు వీల్లేదు. తనలో లోపమేమిటి? అందంలేదా? చదువులేదా? ఐశ్వర్యంలేదా? అదో తన అందం నిలువుటద్దం స్పష్టంగా చెప్పేస్తూంది. ఆ ముక్కూ, ఆ కనులు, ఆ నోరు, హు. బావక్కాకపోతే ఇంకెవడికున్నాయి దమ్ములు? తన కన్నీ ఉన్నాయి. ఎలాకాదంటాడు? నాన్న కోట్లకు పడగలెత్తిన కోటీశ్వర్రావు. అంటే మాత్రం వదుల్తాడేం? అసలు తను వదిల్తేగా ముందు?

బావ వస్తూనే ఎన్నో మార్పులు వస్తాయి. బావకూ తనకూ పెళ్ళి. అవును ఈ ఏడే చేసేస్తారట. మొన్న అమ్మా నాన్నా మాట్లాడుకొంటుంటే తను దొంగచాటుగా వినింది. అబ్బ! పెళ్ళంటే భలే సిగ్గేస్తూంది. తర్వాత? తను గృహిణి అవుతుంది. ఆ తర్వాత... తను అమ్మ....ఛీ!..సిగ్గు.

లేక బావ తన్ను పెళ్ళి చేసుకోనంటే? ఇంకెవరినన్నా చేసుకొంటే? తనేం చేయాలి? తన గతేం కాను? తన స్థానంలో వేరే స్త్రీ ఉండడమా? తన బావను తన నుంచి వేరొకరు లాక్కోపోవడమా? అది తను బ్రతికుండగా జరుగడమే? తను చూసి ఓర్వగలదా? ఓర్చి భరించగలదా?




భరించి జీవించగలదా? దుర్లభం. వద్దు దేవుడా? అంత పని చెయ్యకు. నీకు పుణ్యముంటుంది. నా బావను నానుంచి వేరు చెయ్యకు. ఆ విషయం తను వూహించనైనా వూహించలేదు. తన బావ లేకుండా తనొక్క క్షణమైనా జీవించలేదు. వీల్లేదు. అలా ఎన్నటికీ జరుగదు. జరుగలేదు. జరుగరాదు. బావ తనవాడే. తను బావదే. తమనెవ్వరూ, కడకు దేవుడు కూడా వేరు చెయ్యలేడు.

"అదేమిటే అస్తమానమూ అలా కూర్చొంటావు. ఇంట్లో నేనొక్కదాన్నే ఉన్నాకదా.... ఆఁ. ఏమిటే నాతల్లీ! అలా ఏడుస్తున్నావు. ఏమైందే?"

అమ్మ కంగారుతో ఉలిక్కిపడి రాధ ఈ లోకం లోకి వచ్చింది. తన పరధ్యానానికి తనకే సిగ్గువేసింది. బుగ్గల మీది కన్నీళ్ళను గబుక్కున తుడుచుకొంది. ఏమీకాలేదని అమ్మకు ఎలాగో కష్టంమీద నచ్చ చెప్పగలిగింది.

కానీ తను చేస్తున్న దేమిటి? ప్రొద్దుటి నుంచీ ఎడతెగకుండా తను ఆలోచిస్తున్నదేమిటి? తనకూ ఒక బావ. ఆ బావ అమెరికాలో చదువడం, తనకోసం పరితపించిపోవడం, ఆయనగారు ఇప్పుడు వస్తూ ఉండడం, తను వూహాలోకాల్లో విహరించడం. రాధకు ఫక్కున నవ్వు వచ్చేసింది. లేకపోతే. తనా, మూటాపాతిక రూపాయలు సంపాదించే ఆఫీసు గుమస్తా కూతురెక్కడ? అంతులేని ఐశ్వర్యాలూ, అంతస్తులూ ఎక్కడ? తన పిచ్చి కాకపోతే అవి తనకెలా వస్తాయి? అవన్నీ ఉన్న వాళ్ళకే చెల్లు. ఏమైనా సుజాత చాల అదృష్టవంతురాలు. నాన్న లేక పోయినా అన్ని విధాలా మామయ్యే పెద్ద చేసి పెద్ద చదువులు చదివిన తన కొడుకుతో పెళ్ళి చేయబోతున్నాడు. తనకు మనసైన బావను, తన్ను మెచ్చిన బావను, విదేశాల్లో చదివిన బావను భర్తగా పొందబోతూంది. అందరికీ ఎలా వస్తుంది. ఆ అదృష్టం? అందుకే దేనికైనా పెట్టి పుట్టాలన్నారు.

అమ్మకేకతో ఆలోచనా ప్రవంతికి ఆనకట్ట వేసి లేచిపోయింది రాధ.

పండుకొనేటప్పుడు మళ్ళీ సుజాత జ్ఞాపకం వచ్చింది రాధకు.

సుజాత ఇప్పుడేమి చేస్తూందో. బావగారితో సరసాలాడు తూందేమో. లేక ఏ వూహాలోకాల్లో విహరిస్తూందో. బావ రాబోయేముందు అది తన బావను గురించి ఏమని వూహించిందో! ఎలా కలలు కందో! హు. ఏమీలేని తనే ఇలా కలలుగంటే, అన్నీ ఉన్న సుజాత ఇంకెంతగానో..... ఏమైనా రేపు సుజాతను చూడాలి. దాని మనసులోని భావము తెలుసుకోవాలి. అసలు ముందు సుజాత ఎలా ఉందో చూడాలి. మునుపటికీ, ఇప్పటికీ ఎంత మార్పు వచ్చిందో, అది ఎలాంటి మార్పో తెలుసుకోవాలి. అసలింతకూ అది తనతో మాట్లాడుతుందా అని. ఏమో బావగారిని చూచుకొని దానికి 'స్టైలు' ఎక్కువయిందేమో. 'స్టైలు'గానే మాట్లాడుతుందేమో. ఏది ఏమైనా రేపు సుజాతను చూడాలి. సాయంత్రం వెళ్ళితే? అది బావగారితో ఏ సినిమాకో, షికారుకో వెళ్ళితే తను ఉసూరుమంటూ కాళ్ళీడ్చుకుంటూ తిరిగి రావాల్సివస్తుంది. ఏమైనా రేపు ఉదయమే ఎలాగో వీలు చిక్కించుకొని, అమ్మతో అబద్ధాలైనా చెప్పి వెళ్ళిరావాలి.

రాధ మనసులో సుజాతను చూడాలని ఆతురత మరీ ఎక్కువైపోయింది, ఆ ఉక్కిరి బిక్కిరిలో)

నిద్రపట్టక చాలసేపు అలాగే ఆలోచిస్తూ పొర్లుతూ ఉండిపోయింది.

తెల్లవారుతూనే ముందుగా లేచి ఎప్పుడూ లేనిది అమ్మకు ఇంటి పనుల్లో సహాయంచేసింది. ఇల్లు వూడ్చింది. బావిలో నీళ్ళు తోడింది. బట్టలు మార్చుకొని అమ్మతో 'సుజీని చూసి ఇప్పుడే వస్తానే చాలా రోజులయింది చూసి' అని చెప్పి అనుమతి తీసుకుని మరీ బయలుదేరింది.

గేటు తలుపు తెరచుకొని లోపల ప్రవేశిస్తూనే ఇంటి వాతావరణం క్రొత్తగా తోచింది రాధకు. దూరం నుంచి చూస్తూనే ఏవో కొన్ని మార్పులు జరిగినట్లు కనబడుతూంది. ఇదంతా సుజాత బావగారి ప్రభావం అనుకొంటూ ముందుకు పోయింది. ఇంటి ముందు పచ్చికలో ఓ పెద్ద బల్ల. చుట్టూ కుర్చీలలో నలుగు రబ్బాయిలూ, ఓ అమ్మాయీ ఉన్నారు! 'హోసినీ! ఇంతలో ఎంత మార్పేనీలో' తను అనుకొన్నదే నిజమయిందనుకొంది రాధ. కానీ దగ్గరయేకొద్దీ ఆ వేషం వెగటుగా, ఎబ్బెట్టుగా తోచింది. నీలంరంగు చీర, అదే రంగు పొట్టి చేతుల జాకెట్టు, చీరకట్టను చేతకానట్టు బొమ్మకు చుట్టినట్టుంది. కత్తిరించిన జుట్టు. చేతిలో సిగరెట్టు. ఈ అమ్మాయి సుజాత ఎలా అవుతుంది? ఒకవేళ తను పరధ్యానంలో ప్రక్కఇంటిలో ప్రవేశించిందేమో. రాధ వెనక్కి తిరుగబోయింది. 'కమిన్ మేడమ్' ఓ సన్నని పొడుగాటబ్బాయి. ఇరుకు కాళ్ళ నల్ల రంగు పంట్లాం. రంగుల బుష్ షర్టు. చేతిలో సిగరెట్టు. తిరిగిపోవడం సభ్యత కాదేమోనని ముందుకే వెళ్ళింది. 'కూర్చో'మని ఇంగ్లీషులోనే అంటూ కుర్చీ చూపించాడు. రాధకు ఇది ఇబ్బందిగానే ఉంది. అలాగే నిల్చునే తను సుజాతకోసం వచ్చానని తొడిపడుతూనే చెప్పింది. "సుజాత! ఐసీ సుజాత...." నొక్కి పలికి ఫక్కున నవ్వాడు అతగాడు. అతడు నవ్వి తాము నవ్వకపోవడం సభ్యత కాదన్నట్లు మిగతావాళ్ళూ నవ్వారు. ఆ వింత మనుషుల్లో నిలబడడం రాధకు ముళ్ళపై నిలుచున్నట్లయింది. వెళ్ళొస్తానని చెప్పి వెనక్కి తిరిగింది. అంతా ఒక్కసారి గొల్లున నవ్వారు. రాధకు వళ్ళంతా తేళ్ళు పారాడినట్లయింది. తిరిగి చూడకుండా చరచరా గేటు వైపు నడిచింది. గేటువద్ద పనిమనిషి కనబడితే లేని ఉత్సాహం తెచ్చుకొని అడిగింది.

"సుజాత ఎక్కడ?"

"సుజాతమ్మ, వాళ్లమ్మగోరు ఇప్పు డిక్కడ లేర్లండి. వాళ్ల వూరెళ్లిపోయారు. అయనే మా బాబుగోరు. సుజాత బావగోరు. ఆయమ్మగోర్ని దేశాల్లోనే పెళ్లాడి వెంట బెట్టుకొచ్చేరు." తన బాబుగారి ఘనకార్యానికి గర్వపడుతున్నట్టు.

ఒక్క అంగలో తలుపు తీసుకుని బైటపడి 'హమ్మయ్యా!' అంటూ శ్వాస పీల్చుకొంది రాధ.

"నేను అచ్చం 'ఉత్త కోటీశ్వర్రావు' కూతుర్నే. నాకు ఏ జన్మలోగానీ ఇంతకంటే ఏ భోగ భాగ్యాలనూ ప్రసాదించకు స్వామీ! ఆనందానికి ఐశ్వర్యాలు అక్కరలేదు. మనసులో కలిసే ఒక చల్లని మనసు చాలు." రాధ మనసు పైకి వినబడేలా పదే పదే గొణిగింది. ●

# పురుస లచ్చనం

దండాలండి బాబయ్యా—దండాలండి!—
పెద్దోల్లందరికీ దండాలండి.
నన్ను సుబ్బన్న అంటారండి.
అసలు నా పేరండి— సుబ్బారాయుడండి.

మా బాబు పేరూ అదేనండి— సుబ్బడండి. ఆమాట కొత్తే మా తాత పేరూ అదేనండి— సుబ్బారాయుడండి.

మా తాతకి అల్లతాత పేరెట్టారండి.
అల్లతాతకీ అల్లతాత పేరేనండి.
మా బాబుకి మాతాత పేరెట్టారండి.
నాకూ మా బాబు పేరే పెట్టిర్నండి.
ఇసువంటి గరానావంశం బాబూ, మాది

అయ్యగోరండి!— సిన్నప్పుడండి— నన్ను కూల్లో యేత్తేనండి— మా బాబు సేసిన పెసరట్లన్నీ నేనే — నా ఒక్క సేతిమీద అమ్ముకొచ్చేవోణ్ణండి.

పెసరట్లూ, మసాలగార్లూ జంగిట్లోయేసుక్కొని నెత్తి నెట్టుకుని కూలుకుపోయే వోణ్ణండి. కూలు గేటు ముందర నించుని—

పెసరట్లో— పెసరట్లు
ఏడేడి పెసరట్లు
ఎడ్మాట్టారి పెసరట్లు
పంతులుగోరి కిట్టవయిన
పసందయిన పెసరట్లు

అంటూ పాడతావుంటే కూల్లో కుర్రోళ్లు, పెద్దోళ్లు అంతా నాసుట్టూ ఎగబడేవోల్లండి. నా జంగిట్లో సరకంతా చనంలో ఎగిరిపొయ్యేదండి.

వోనాడండి—

మా ఎడ్మాట్టారి కోప్మొచ్చిందండి. ఏం బెత్తం పట్టుకొచ్చేరండీ, నా యీపుమీద సురుకు సురుక్కుమని బాదేశారండి. పండక్కి మా బాబు కుట్టించిన పారలసొక్కాలాగా నా యీపు యీపంతా సట్లు తేలినయండి.

"ఎదవా!—నువ్వు కూలుకి రావటం పాటాలు నదవటాంకా, పెసరట్లమ్ముకుందుకా?—" అని అడిగిర్నండి.

అందుకు నేనేం జెప్పినానంటే నండీ—
"పాటాలూ సదువుకుంట—పంతులుగోరూ
నాకు—పెసరట్లే కూడు పెట్టు—పంతులుగోరు"

ఆపళంగానండి— ఎడ్మాట్టారండి— కల్లెర్ర జేసిర్నండి. సర్రుమంటూ వో కాయితంముక్క తీసిర్నండి. అంకోకు సుట్టలాంటి కలం తీసిర్నండి. బరబరా ఏందో రాసిర్నండి. అంతేనండి. "పోరా సవటా!— నీ కింక సదువూరాదు, సందేరాదు పెసరట్లమ్ముకుబతుకు— పో" అని కూల్లోంచి తగిలేసిర్నండి.

ఆ తరవాతండి—

మా వూల్లో రంగయ్యకొట్లో రెండ్రోలు పన్జేసినానండి. మునలయ్య దుకాన్లో మూడ్రోలు సేసినానండి. పరసయ్య అంగట్లో నాల్రోలున్నానండి. అప్పిగాడి అప్తిలో అయిదురోజులు కొలువున్ననండి. తరవాతండి—ఎవరెవడూ నన్ను పన్లోకి పిలవలేదండి.

ఆ దరిమిలానండి—పనీ పాటూ లేకుండా ఉండానని మా మావకి తెలిసిందండి. నన్ను పిలిచినడండి. పిల్లనిచ్చి పెళ్లిసేసినడండి. అదేటిపెళ్లో, అదేటి కుర్రదోగాని సూస్కొండయ్యా, ఆరేళ్ళు తిరక్కుండా అరడజను పిల్లలండి బాబయ్యా!—

అయ్యలారా!— నే నిప్పుడు ఒంటిగాణ్ణి గాదండి. పెళ్లాముహోడినండి. పిల్లలవోడినండి. పేదవోడి నండి. సదువు సందెలు లేనివోణ్ణండి.

కనక—

బాబయ్యా!—నామీద దయవుంచి—కాదు కాదు నా పెళ్లాం పిల్లలమీద కనికరముంచి, తమ ఆఫీసులో—ఏదేనా వోమూల ఖాళీచూసి—ఏ ఉజ్జోగ మయినాసరే, ఎలాటి ఉజ్జోగమయినాసరే—దయసేయించగలందులకు మిక్కిలి వినయ విధేయతలతో తమ గనతను ప్రార్థిస్తుండాను. సెలవు.

ఇట్లు,
మీ పరమ విధేయుడు
—సుబ్బారాయుడు

—'మోనో'